# అదినిజం. ఇదినేడు!

కుతూహలం— ఒక్కొక్కప్పుడు మహ చెడ్డది.

ఒక్కొక్కప్పుడు అమిత మంచిది.

ఎడనెడ అత్యవసరపరిస్థితి కల్పిస్తుంది.

ఏ కొండ గుహలోనో ముక్కు మూసుకుని ఏకాంతంగా సమాజానికి దూరంగా బ్రతికితే తప్ప మనిషన్నవాడు కుతూహలం బారినుండి తప్పించుకోలేడు.

మా ఆఫీసులో ఓ వింత మనిషున్నాడు. వింత అంటే అతనికి నాలుగు కాళ్లూ, ఐదు కళ్లూ ఉన్నాయని కాదు. మనలో లేనిది-అతనిలో ఉంది. అదే వింత. ఆ వింత మనిషి పేరు—వేణు. చాలా అందమైన వాడు.

అపరిమిత మితభాషి. మంచి గుమాస్తా. అవసరానికి మించి అక్షరం పొల్లుమాట మాట్లాడని వాడు. నిజానికి ఇటువంటి మనిషి మా మధ్య ఉన్నందుకు మేము గర్వించాలి. ఎమర్జెన్సీ డిక్లేర్ చెయ్యక ముందుకూడా పది గంటల ఒక నిముషానికి సీటులో కూర్చుని పని ప్రారంభించేవాడు.

ఐదు గంటల ఒక నిముషానికి ఆఫీసు మెట్లు దిగేవాడు ఈ చివరి నిజం. ఇదే మా పాలిటి శత్రువై కూర్చుంది. ఓవర్ టైముకి మా శాఖలో అవసరం లేదు. ఉన్నా, ఓవర్ టైము వొద్దని ఐదు అయ్యే సరికి వెళ్ళిపోయేవాడే ఏమో!

మనిషి సంఘజీవి. చుట్టూ ఉన్నవారిననుసరించి ప్రవర్తిస్తూ ఉండాలి అది. మనిషిగా అతని ధర్మం, న్యాయం వీటి నతిక్రమించే వేణు మాకు పచ్చి వెలక్కాయ ఐపోయాడు.

మగవాళ్ళకు కొన్ని ప్రివిలేజెస్ ఉన్నాయి (ఈ నిజాన్ని రాస్తున్నందుకు మహిళలు క్షమించాలి). సిగరెట్లు పేకాట తాగడం రోడ్లమీద పని లేకుండా తిరగడం, ఎవరికీ చెప్పకుండా సినిమాలకి పోవడం—వగైరాలు.

ఈ అవకాశాలు ఆడవాళ్ళకి లేవనికాదు. ఉన్నావాళ్ళు ఎప్పుడో తప్ప వినియోగించుకోరు. వాడుకనుబట్టి కొన్ని అధికారాలు ప్రాప్తిస్తాయి కదా? (చూడుడు. 'లా'లో యీజ్‌మెంట్ అను అధ్యాయము).

ఈ మగ అధికారాలను వేటినీ వేణు ఉపయోగించడు. అతని జీతంలో ఐదు పైసలుకూడా తగ్గదు.ఏ డిడక్షనూ ఉండదు జీతంలో. కవరు తెరవకుండా జేబులో వేసేసుకుని వెళ్ళిపోయే వేణుని చూస్తే మాకు మహా అసూయ.

ఆవేళ—"ఈ వేణు మన కొంప ముంచుతాడోయ్ ఏదో ఓరోజు," అన్నాడు శంకరం నేను చేసిన డీలుషోకి డబ్బు లిస్తూ.

ఆడుతున్న ఆరుగురమూ భయంగా చూశాం. శంకరం తత్వమే అంత. ఉండుండి పిడుగులాటి మాట పడేసి మనని కంగారు పెట్టేస్తాడు

అతని మాటలకి టీకా తాత్పర్యా లతనే చెప్పాలి. లేకపోతే అన్వయించుకుని అర్థం చేసుకోవడం మన తరంకాదు.

"ఆడవాళ్ళకి అంటువ్యాధులు అతి

సోకి

త్వరగా వ్యాప్తిస్తాయి కనుక మనం వెంటనే మేలుకోవాలి. మేలుకుని తీరాలి."


విశ్వం—సస్పెన్సు భరించలేక—ఓ అరుపు అరిచాడు—"మా కర్థమయ్యేటట్లు ఏడవ్వోయ్ ఆ ఏడ్చే దేమిటో—"

ఆ కాంప్లిమెంటు తింటేతప్ప శంకరం సవ్యంగా చెప్పడు.

"మనం అంతా మంచివాళ్ళం. పేక ముక్కల్ని ప్రేమించగలం. రమ్మనైనా రమ్మని పిలవగలం. తెలుగు సినిమాలకి కూడా రెగ్యులర్‌గా అటెండెన్స్ వేయించుకోగలం. రష్‌ని పెంచడం ఎందుకని అర్ధరాత్రి తప్ప యిళ్ళకి చేరని అతి మంచి వాళ్ళం. వేణు—విద్రోహి. అతను ఐదూ పదీ అయ్యేసరికి ఇంట్లో—ఇల్లాలిముందు వాల్తాడు. ఆడవాళ్ళ నోట్లో అయ్యరిడ్లీ కూడా నానదు. వేణు భార్య మన భార్యలతో (శంకరం భాష అంతే) తన భర్త మంచితనం గురించి చెప్పక మానదు. ఇహ మనకి ఇంటికి చేరేసరికి-సీతాపతీ.... చాపే గతీ అంటూ పాటలో కలిసిపోయాడు. శంకరం పాటలో పడ్డాడంటే ఆపడం ఎవరి తరమూ కాదు. మ్యూజిక్ కూడా సొంతంగా యిచ్చేసుకుని మూడు నిముషాలూ మాడెగర గొడతాడు.

సమస్య — ప్రమాదం — అర్థమైపోయింది అందరికీ.

మోహన్ మెల్లగా అన్నాడు—"ఫర్లేదర్రా. వేణు భార్య కూడా నన్ను ముట్టుకోకు నామాల కాకే. వేణుకి తగ్గదే."



“ప్చ్!” నిట్టూర్చాడు రఘు. “లాభం లేదొరేయ్. ఆడాళ్ళని నమ్మలేం.”

రచయిత కావాలని ప్రయత్నించి ప్రయత్నించి మానేసిన రఘు కథ చెప్తాడని తేలిపోయింది. పాఠకులు దొరక్కపోయేసరికి శ్రోతలకి పురాణ కథలు చెప్పేడం అలవాటు చేసుకున్నాడు. మాంచి సైజుచూసి—పేకాటదగ్గరా—క్యాంటీన్ టేబులు దగ్గరా కథలు చెప్పేస్తుంటాడు రఘు. మేము చిక్కిపోయాం.

కథ—విని చావ్వలసిందే.

“అడవిలాటి చోట రెండే రెండు కుటుంబాలుండేవి. ఆడాళ్ళిద్దరూ పోట్లాడేసుకున్నారు ఎవరు ఎవర్ని అక్కా అని పిలవాలా తేలక ఒకరింటి పోపు రెండో యింట ఘుమఘుమ లాడకుండా తలుపులు మూసేసుకున్నారు. కొంతకాలం గడిచింది. సంక్రాంతి పండగొచ్చింది ఆ వేళ ఇద్దరూ ఒక్కసారే రెండిళ్ళ మధ్య తలుపులూ తెరిచారు. వాళ్ళ చేతుల్లో

“ఏమున్నాయ్?” సస్పెన్సు భరించలేని విశ్వం కరిచినట్లు కసిరాడు.

త్రుళ్ళిపడి నోరు జార్చాడు రఘు—“కొత్త చీరెలు. పండక్కి మొగుళ్ళు కొన్నవి—”

“నిజమే—” వంత పలికాడు శేఖరం. “ఆడవాళ్ళ చీరలపిచ్చి అలాటిదే. మా ఆవిడ ప్రయాణ మైందంటే కిందటి సారి వచ్చాక కొన్న చీరలన్నీ పట్టుకెళ్తుంది అక్కడుండేది ఒకటి రెండ్రోజులే అయినా ”

“కనుక—ఏ కొత్తచీరో మన మహిళా మణులను ఏకం చేయక మానదు.

ఆ యొక్క మహిళా మండలిలో—మొగుళ్ళ మంచి చెడ్డల ప్రసక్తి— ”

“మన మొహాలు! మనలో మంచి అదే చెడ్డ ఏమంటుంది”?

“అలాగనకు. ఆడవాళ్ళు అసాధ్యులు. ఐస్‌క్రీముతో అగ్గిపెట్టె వెలిగించేగల్రు. మనం యింత మంచివాళ్ళమా? ఏస్త్రీ స్తంత గుడ్‌షెపర్డ్స్‌మా? మనలోకూడా లోపం ఎంచేగల్రు.”

“ముందు—కర్తవ్యం ఆలోచించండి. అసలే మన మగాళ్ళకి రోజులు బాగులేవు. ప్రమాదం రాకుండా జాగ్రత్త పడకపోతే మన పేకాట గల్లంతు. వెట్ పార్టీలకి నూకలు చెల్లు. సాయిబు మసాలా పకోడీలూ, రామయ్యా చేగోడీలూ ”

అందరూ తీవ్రాలోచనలో పడ్డారు. పేకాట సాగుతూంది—నిశ్శబ్దంగా.

అందరి ముందూ ఒకటే ప్రశ్న. వేణు అంత టంచన్‌గా ఇంటికెందు కెళ్తాడు? వెళ్ళి ఏం చేస్తాడు?

“హాఁ తెలిసెన్ ” అరిచాడు రఘు. “దొంగ రాస్కెల్' ఇందుకా యిల్లు పట్టుకు వేలాడతావ్! నువ్వు నీచుడివి. దుర్మార్గుడివి. దుశ్శాసనుడివి. సినిమా విలన్‌వి.”

“ఎవరు?”

“ఇంకెవరు? వేణు.”

“వేణు ఎందుకు నీచుడు? దుర్మార్గుడు? దుశ్శాసనుడు? సినిమా విలనుడు?”

ఆవేశంగా రొప్పి—“వేణుభార్య చాలా అందమయింది. వీడిది వొట్టి విషపు హృదయం. అందుకే ఆమెను—సీతలాటి ఆమెను—అనుమానించి వీలైనంత సేపు కాపలా కాయడం. అందుకే ఆఫీసు



నుంచి అలాగ పరుగెత్తడం—  "అని ఆగాడు.

ఒక్కసారిగా చర్చ సీతమీదకి మళ్ళింది.

వేణు భార్య పేరేమిటో మాకు తెలీదు. సీత అనే ఉదహరించుకోసాగాం.

సీతను చాలా అందగత్తెగా తేల్చి పారేసింది మా సంఘం.

"పెళ్ళా న్ననుమానించడ మేమిటీ బొత్తిగా!"

"పెళ్ళాన్నికాక ఎవరి ననుమానిస్తే ఎవరూరుకుంటారు?"

"మనం మంచివాళ్ళం. ఎందుకంటే పెళ్ళాల ననుమానించం."

పకోడీలూ, టీ, చేగోడీలూ, సిగరెట్లూ అన్నీ ఐపోయాక పేకాటా ఐపోయింది. కొందరి జేబుల్లో డబ్బులూ ఐపోయాయి.

వాచ్‌మన్‌చేత చీవాట్లు తిని—క్లబ్బు వొదిలి రోడ్డుమీద పడ్డాం.

"చూడూ! రేపు నువ్వు వేణు దగ్గరికెళ్ళి నాలుగు చీవాట్లు పెట్టి—అనుమాన పడకూడదని చెప్పి—మనలో కలపాలి. ఏం?"


నలుగురూ కలిసి అలాగ ప్రతిపాదించాక యిక నేనేం చేసేది? కాదన్నా లాభం లేదు. ఎలాగో పని ముగించాలి సవ్యంగా. పిల్లి మెడలో గంట కట్టవలసిన బాధ్యత నామీదపడినందుకు భయపడుతూనే అంగీకరించాను.

ఆ రాత్రి నిద్రకి స్వస్తిచెప్పి—సిగరెట్ల నాశ్రయించి—వేణుని జయించడానికి ఉపాయాలాలోచించాను.

తెల్లవారింది. ఆఫీసుకి గంట టైముందనగానే వేణు యింటికి బయలుదేరాను.

"రండి —"ఆహ్వానించాడు వేణు. అప్పటికే అతను భోజనమో టిఫినో కానిచ్చేసినట్లున్నాడు. నాకు-కాఫీ తెప్పించాడు.

అప్పుడు అతని శ్రీమతిని చూశాను.



ఈ అమ్మాయిని దమ్మిడీ కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకున్నానర్రా!

మే మనుకున్న దానికంటె ఎక్కువ అందంగా లేదు.

ఇద్దరమూ కలిసి ఆఫీసుకి బయలుదేరాం.

"చూడండి వేణూ!—"

"ఏమిటి?"

"అనుమానం అనేది మంచి లక్షణం కాదు "

ఆశ్చర్యంగా చూశాడు.—"ఔను."

"అందులోనూ—మగవాడు—భార్యననుమానించడం చాలా ఘోరం."

"అంతకంటెనరకం మరొకటుండదు. ఏమంటారు?"

"మీరు చాలా నిజం చెప్పారు. తిరుగులేని నిజం—" నవ్వాడతను.

మెత్తని పులి—అనుకున్నాను.

ఈ మనిషిని మృదువుగా జయించడం అసాధ్యం అనుకున్నాను.

ఆఫీసు—దగ్గర పడిపోతూంది.

"థాంక్స్ ఇవాళనుంచీ మీరు అనుమానపు నరకంనుంచి బయటపడి "

"సారీ," నవ్వుతూనే అన్నాడు-"నా తరం కాదు—"

నాక్రోసం వొచ్చింది, ఓడిపోతున్నందుకు బాధ. "ఎందుకని? మీరు మనుషులు కారా? మీలో మానవత్వం లేదా? అనుమానించడం అమానుషం కాదూ?"

"క్షమించండి, మీరు వాగ్దానం చేస్తే మీకొక తియ్యని రహస్యం చెబుతాను—"

"సరే" వాగ్దానం చేశాను.

"ఎవరికీ చెప్పకండి. చెబితే ప్రమాదమని కాదు. కానీ—"

"చెప్పనన్నానుగా—"

"అనుమానం ఎప్పుడూ చేదుగానే ఉండదు. ఒక్కొక్కప్పుడు మధురంగా అతి మధురంగా ఉంటుంది."

"నాకు—కవిత్వం అర్థంకాదు."

"ఆ చక్కని అనుభవాన్ని—మాటలలోకి యిమడ్చడం చాలా కష్టం. భార్య భర్తననుమానిస్తే — చాలా హాయిగా ఉంటుంది. మా శ్రీమతికి—నా అందాన్ని చూసి ఎవరయినా ప్రేమించేస్తారని తెగ భయం. అందుకని తన శాయశక్తులా నా చుట్టూ అనుక్షణం అందమైన స్వర్గాన్ని సృష్టించాలని ప్రయత్నిస్తూంటుంది. వివరాలు ఒకరికి చెప్పదగ్గవి కావు, నాకోసం రోజుకొక స్వర్గం సృష్టించేది మా శ్రీమతి. ఒక్కొక్క బందిఖానా బాధగా ఉండదు. తీయగా ఉంటుంది అది—అనుభవైక వేద్యం "

ప్రపంచాన్ని మొదటిసారి చూసినట్లయింది

నన్ను చూస్తూ — జాలితో కాబోలు నవ్వుతున్నాడు వేణు.

అతనిమీద అసూయ వేస్తోంది!

భార్యలు తీయగా అనుమానించగలరా?

★